క్లుప్తంగా

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత



క్రీడా పరికరాలతో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు

చినలింగాయపాలెం(కాకుమాను): పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు విద్యార్థుల విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం, గ్రామంలోని దాతలతో పాటు పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావల్సిన మౌలిక వసతులు కల్పించవచ్చునని ఆయన తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సీఎం వైఎస్ జగన్ సభకు తరలిన రైతులు



గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు రైతులు మంగళవారం తరలివెళ్లారు. తెనాలిలో నిర్వహించిన రైతు భరోసా, నష్టపరిహారం విడుదల సభ నిర్వహించగా మండలంలోని జొన్నలగడ్డ, దాసుపాలెం, చల్లావారిపాలెం, గోర్లవారిపాలెం, చిన్నపలకలూరు, మల్లవరం, తోకావారిపాలెం తదితర గ్రామాలనుంచి రైతులు భారీగా వెళ్లారు.

దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చే బాధ్యత విద్యార్థులదే



డాక్టర్ బులుసు వెంకట శారద

చేబ్రోలు: దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చే బాధ్యత విద్యార్థులదేనని హైదరాబాద్‌లోని ఏఆర్‌సీఐ(ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్) సైంటిస్ట్ ఎఫ్ డాక్టర్ బులుసు వెంకట శారద అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం నేషనల్ సైన్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'మెటీరియల్స్ అండ్ టెక్నాలజీస్ ఫర్ ఎనర్జీ స్టోరేజ్ అండ్ బయోమెడికల్' అనే అంశంపై ఆమె మాట్లాడారు. ఈ ఏడాది నేషనల్ సైన్స్ డే ఉత్సవాలను 'గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్' అనే ఇతివృత్తంతో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. వెంకట శారద మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పుడు కష్టపడి చదివితేనే మీరు భవిష్యత్‌లో ఉజ్వలంగా ఎదగగలరన్నారు. నానో టెక్నాలజీలో పట్టు సాధిస్తే మెడిసిన్, హెల్త్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోటెక్నాలజీ, అడ్వాన్స్‌ మెటీరియల్స్ అండ్ టెక్స్‌టైల్స్ వంటి రంగాలలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు.

కారు దహనం



గుంటూరు రూరల్: ఇంటి ముందు కారు పార్క్ చేసి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కారును దహనం చేసిన ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. గోరంట్ల సున్నపుబట్టీల సెంటర్‌లో మన్నెం లక్ష్మి, భర్త శ్రీనివాసరావు నివాసం ఉంటున్నారు. పక్కనే రియల్ ఎస్టేట్ కార్యాలయం నిర్వహిస్తూ జీవిస్తుంటారు. సోమవారం రాత్రి తన హోండా కారును ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత రోడ్డుపై వెళుతున్న వాహనదారులు కేకలు వేయడంతో లేచి చూడగా కారు దహనమవుతుండటం గమనించి మంటలు ఆర్పే సమయంలో లక్ష్మికి స్వల్పగాయాలు అయ్యాయి. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

● ఆత్మీయ ఆహ్వానం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలి పర్యటన సందర్భంగా పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. - చేబ్రోలు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలి పర్యటన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని నంబూరు గ్రామ పరిధిలో బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బత్తుల శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఆలీ రఫత్ కాలనీ, విజయ భాస్కర్ నగర్, అంబేడ్కర్ నగర్, జయభారత్ రెడ్డి నగర్, ముస్లిం పాలెం, వీవీఐటీ రోడ్, కప్పలగుంట, పంచాయతీ ఏరియా వినియోగదారులు సహకరించాలని కోరారు.

చేబ్రోలులో దంత వైద్య శిబిరం

చేబ్రోలు: దంత సమస్యలపై విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేర్ డెంటల్ కళాశాల, హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. చేబ్రోలులోని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని 164 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యులు రాజశేఖర్ మాట్లాడుతూ దంత సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి రోజు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, బీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

స్టెప్ సీఈఓ పల్లవి

పెదకాకాని: విద్యార్థులలో సృజనాత్మకత శక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ తిలకించారు. ఆమె మాట్లాడుతూ నోబెల్ పురస్కార గ్రహీత, భౌతికశాస్త్ర పితామహుడు సర్ సీవీ రామన్ సేవలను కొనియాడారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లలో పాల్గొనే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ కల్యాణి, నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బాబు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: సమాజాభివృద్ధికి ఉపయోగకరమైన పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం కళాశాలలో నిర్వహించిన జాతీయ విజ్ఞాన దినోత్సవంలో భాగంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికత అందరి బాధ్యత

గుంటూరు రూరల్: ఆధునిక సాంకేతికతతో సమాజానికి ఉపయోగకరమైన పరిశోధనల దిశగా విద్యార్థులు కృషిచేయాలని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా బహుమతులు పొందిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అభినందించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రామారావు తదితరులు

వివా ది స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

పెదకాకాని: సర్ సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థులు విజ్ఞాన రంగం వైపు ఆకర్షితులు కావాలని వివా, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఆకాంక్షించారు. నోబుల్ పురస్కార గ్రహీత శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ ధ్రువీకరణ పొందిన రోజును పురస్కరించుకుని నిర్వహించు జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నంబూరు వివా ది స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకత వెలికితీయటానికి సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన థీమ్ గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్‌ను అనుసరించి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారన్నారు. సైన్స్ సూత్రాలు అన్వయించి విద్యార్థులు ప్రదర్శించిన 180 సృజనాత్మక ఆవిష్కరణలు, ప్రయోగాలు ఈ ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్నాయి. అగ్రికల్చరల్ ఇరిగేషన్ మోడల్స్, వాటర్ లెవల్ ఇండికేటర్స్, సోలార్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నమూనాలు జైంట్‌వీల్, ఫింగర్ ప్రింట్ మిషన్, బాడి సిస్టమ్ వర్కింగ్, మైక్రోస్కోప్‌ల పనితీరును వివరిస్తూ చేసిన విద్యార్థుల ప్రదర్శనలు ఆకర్షించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ సమన్వయకర్త కె.మాధవి, సీబీఎస్‌ఈ సమన్వయకర్త జ్యోతి మెటిల్డా పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

సేంద్రియ ఉత్పత్తులకు పెరిగిన డిమాండ్

హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ

గుంటూరు రూరల్: రైతులు పండించిన పంటలకు విలువలు జోడించి అధిక లాభాలు పొందవచ్చని హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో రైతులకు సేంద్రియ వ్యవసాయం, విలువల జోడింపుపై రైతు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ రైతులు పండించే పంటలకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందన్నారు. సేంద్రియ పంటల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అందుకోసం రైతులు తాము పండించిన పంటలకు విలువలు ఏవిధంగా జోడించాలి తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో రైతు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, కషాయాల తయారీని వివరించారు. ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు కె.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులు వినియోగం వలన పంటలు విషతుల్యం అవుతున్నాయన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండించటం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు, పండించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ రిటైర్డు అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రం, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, రైతు శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



మహిళా రైతుకు సర్టిఫికెట్లను అందజేస్తున్న హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ తదితరులు

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

కాకుమాను: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ అన్నపూర్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం యువతా మేలుకో–భవితను మలచుకో డ్రగ్స్ వదులుకో అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ నేటి సమాజంలో అనేక మంది విద్యార్థి దశలోనే డ్రగ్స్‌కు బానిసైలు నిండు జీవితాలు పాడు చేసుకుంటున్నారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని చెప్పారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే వారి వివరాలను టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈసందర్భంగా డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే అనర్థాల గురించి వివరించి టోల్ ఫ్రీ నంబర్ వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.జోష్ మేరి,సెబ్ ఎస్ గీతిక పాల్గొన్నారు.



టోల్ ఫ్రీ నంబర్ కరపత్రాలను చూపుతున్న సూపరింటెండెంట్ అన్నపూర్ణ తదితరులు

తనబుద్దు కృష్ణారెడ్డికి ఘన నివాళి

గుంటూరు రూరల్: ప్రజా సమస్యల కోసం నిత్యం కృషి చేసే మంచి మనసున్న నాయకుడు తనబుద్దు కృష్ణారెడ్డి అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డి దశదిన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్ దంపతులు, ఎమ్మెల్సీలు అభ్యర్థులు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణ, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు తాడిశెట్టి మురళి, డెప్యూటీ మేయర్‌లు షేక్ సజీల, డైమండ్‌బాబు ఉన్నారు.



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే సుచరిత

తాగునీరు సరఫరా చేయాలి

గుంటూరు రూరల్: నగరంలో పలు ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో తమకు తాగునీరు అందటంలేదని 40వ డివిజన్ రత్నగిరినగర్ వాసులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకుని నగరంలో పలు ప్రాంతాల్లో ప్రజలకోసమే తాగునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని అప్పటి వరకూ లారీలు ఇతర సాధనాలతో నీటి ఇబ్బందులు తీరుస్తామని చెప్పటంతో ఆందోళన విరమించారు.

యువకుడి ఆత్మహత్య

పెదనందిపాడు: అనారోగ్య సమస్యలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పాలపర్రు గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాలు.. కాకుమాను మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి ధనుంజయ్(35) అనారోగ్య కారణాలతో పాలపర్రులో అంత్రం వేయించుకునేందుకు వచ్చాడు. తర్వాత ఫోన్ పనిచేయడం లేదు. గ్రామ శివారులో పొలం వద్ద వ్యక్తి స్పృహ లేకుండా పడి ఉండటం గమనించిన స్థానికులు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. తండ్రి వెంకటరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగాలకు 287 మంది విద్యార్థినులు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ జ్యోత్స్న కుమారి, అపర్ణ సీతారామ్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం (జేకేసీ) ఆధ్వర్యంలో రేణిగుంటకు చెందిన డిక్సన్ ఇండియా ఎలక్ట్రిక్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 287 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన 374 మంది విద్యార్థినులకు మౌఖిక పరీక్ష అనంతరం 287 మందిని ఎలక్ట్రానిక్ కేబుల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ అండ్ అసిస్టెంట్ లైన్ లీడర్ ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి అభినందించారు. ఇంటర్వ్యూ ప్రక్రియలో డిక్సన్ కంపెనీ ప్రతినిధి దొరబాబు, జేకేసీ సమన్వయకర్త కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్ ఖాన్, అపర్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉర్దూ అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయం

పెదకాకాని: ఉర్దూ పాఠశాలల్లో విద్యాభివృద్ధి ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయమని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం అన్నారు. మండలంలోని పెదకాకాని, వెంగళరావు నగర్, వెనిగండ్ల గ్రామాల్లో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. పెదకాకాని గ్రామంలోని వెంగళరావు నగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి డి బలిరాంతో కలిసి జగనన్న గోరుముద్ద(మధ్యాహ్న భోజన పథకం) పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ ఉర్దూ ప్రాథమిక పాఠశాలల అభివృద్ధిలో మండల విద్యాశాఖ అధికారి పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉర్దూ తప్పక బోధించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పద్ధతిలో బోధన సాగించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలను నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్ బుక్స్‌తో పాటు వారి సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.బలిరాం, ఉపాధ్యాయులు బాజీ బాబా, ఫిరోజ్, కల్యాణి పాల్గొన్నారు.



పెదకాకానిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం

జన్యుమార్పిడి పంటలతో నష్టం

గుంటూరు ఎడ్యుకేషన్: జన్యుమార్పిడి పంటలతో పర్యావరణ సమతుల్యతకు నష్టమని లాం ఫామ్ సీనియర్ శాస్త్రవేత్త జీఎంవీ ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాదరావు జన్యుమార్పిడి పంటలతో కలిగే నష్టాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు టీఆర్ రమేష్, డాక్టర్ కొల్లా రాజమోహన్, ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాదరావు

హిందూ కళాశాలలో...

మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో సైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ ఫలితాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిత్య జీవితంలో సైన్స్ ప్రాధాన్యత, దేశాభివృద్ధికి సైన్స్ ఏ విధంగా దోహదపడుతుందో తెలిపారు. సైన్స్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెరువు రామకృష్ణ మూర్తి, బోటనీ పీజీ ఇన్‌చార్జి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, కె.కాళిదాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

అప్పాపురం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన గుణాత్మక విద్యనందించాలని ఎంఈఓ కేఫ్ కెనడీ అన్నారు. మండలంలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అనేక రూ.కోట్లు ఖర్చు చేసి విద్యార్థులకు కావల్సిన అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ కెనడీ

బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి

పెదనందిపాడు: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం మండల రిసోర్స్‌పర్సన్ చింతా వరప్రసాద్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లు, పలు విత్తనాలు(పప్పు గింజలు, చిరుధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, నూనెగింజలు) భూమిలో వేసేముందు బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, వెద పద్ధతిలో వేసుకోవాలని సూచించారు. నాటిన విత్తనాలు 45 రోజుల తర్వాత పూత దశలో ప్రధాన పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలని తద్వారా వేసే పంటకు ఎటువంటి తెగుళ్లు రావని చెప్పారు. ర్యాలీలో పీఆర్‌పీ లక్ష్మి పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, రైతులు

కనుల పండువగా కల్యాణోత్సవం

పాతగుంటూరు: అరండల్ పేట నాలుగో లైనులోని అష్ట లక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధానాచార్యుడు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో ఉదయం శ్రీచక్ర అభిషేకాలు, నిత్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రాల నడుమ కనుల పండువగా ఆదిలక్ష్మీ నారాయణుల కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, రక్షాధారణ, నవగ్రహారాధన, మాంగళ్య పూజ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

